# శత్రువు

రాత్రంతా నిద్ర లేదు. వాతావరణంలో వేడి తప్ప మరేం లేదు. ఫ్యాను తిరుగుతున్నా, చప్పుడు తప్ప గాలి రావడం లేదు. అలసటగా, నీరసంగా, లేచే ఓపిక లేనట్లు పక్క మీద దొర్లుతున్నా, చిటుక్కు చిటుక్కుమని మెడ మీద ఏదో కుట్టినట్టయితే లేచాను.

బొటనవేలుకీ, చూపుడు వేలుకీ మధ్యన చిక్కిందాక నలుసులాంటి ఎర్రచీమ. మళ్ళీ చురుక్కుమంది. చూస్తూ మరో చీమ మళ్ళీ మళ్ళీ చిటచిటలాడిపోతుంటే ఒక్క ఉదుటున పక్క మీంచి లేచాను. నా మెడ మీంచి వీపు మీదకి, చేతుల మీదకి యథేచ్ఛగా పాకుతున్న సన్నని ఎర్రచీమలు. గబగబా దులుపుకోవడం మొదలుపెట్టాను. అయినా అవి కుట్టగలిగినంత వేగంగా, నేర్పుగా కుట్టనే కుట్టేశాయి. ఒళ్ళంతా చిరచిరలాడిపోయింది మంటతో. చల్లని నీళ్ళతో ముఖం, చేతులూ కడుక్కుని బ్రష్ తీసుకున్నాను. ఇంకా అయిదు గంటలైనా కాలేదు గానీ, అప్పుడే వెలిబూదిలాంటి వెలుగులు పరుచుకుంటున్నాయి.

రాత్రి పాలు కాచి ఫ్రిజ్‌లో పెట్టటం మర్చిపోయానులాగుంది. అవి బయటనే ఉన్నాయి. కాఫీ కలుపుకుందామని చూడబోతే గిన్నె అంచున చిద్విలాసంగా అటూ ఇటూ తిరిగేస్తున్నాయి ఎర్రచీమలు. కొన్ని అప్పటికే లోపల పడి ప్రాణాలు కోల్పోయాయి.

నెమ్మదిగా చీమలన్నీ దులిపి కాఫీ డికాక్షన్ తీసి, పంచదార వేసుకోబోతే, ఎవరో డబ్బా మూత గట్టిగా పెట్టలేదు కాబోలు దాన్నిండా బోలెడన్ని చీమలు. మొత్తం

పంచదార ఓ ప్లేటులో పోసుకుని శుభ్రంగా దులిపి మరో సీసాలో పోసి కాఫీ తాగే సరికి అరగంట పట్టింది. ఆ రోజు కాయబోయే ఎండ తీవ్రత అప్పుడే సూచనలివ్వడం ప్రారంభించింది. ఎండ పెరగకుండా వంట పూర్తి చేసి కూర్చుందామని కూరల బుట్టలో బెండకాయలు తీశాను. పొంచి వుండి, వచ్చే శత్రువు మీద కురికిన సైనికుల్లా నా చేతుల మీదకి పాకాయి చీమలు. హడావిడిగా బుట్ట కిందకి వదిలేశాను. కూరలన్నీ ఇల్లంతా చిమ్ముకుపోయాయి కానీ, చీమలు నా చీరంతా పట్టుకున్నాయి. అయితే అందులో అమెరికన్ పాప్యులేషన్‌లా ఎర్రచీమలు, నల్లచీమలూ చెదిరిపోయాయి. నల్లచీమలు హడావిడి, అల్లరీ చేస్తూ కాళ్ళ మీదా, చేతుల మీద పాకి చిరాకు కలిగిస్తాయి గానీ కుట్టవు. ఎర్రచీమలలా కాదు. పాలస్తీనియన్ గెరిల్లాల కంటే, పాకిస్తాన్ టెర్రరిస్టుల కంటే భయంకరం.

అప్పటికే కొన్ని ఎర్రచీమలు చాకచక్యంగా నా చేతుల మీదా, మెడ మీద కుట్టేశాయి. ఒక్కసారిగా నాకు నిస్సత్తువా, నీరసం కమ్మేశాయి. అవి కుట్టిన చోట దురద, మంట, అంతలోనే దద్దురు - చిన్నగా ఎర్రగా చటుక్కున చూస్తే కనిపించకుండా నలుసుల్లా - అబ్బ! ఎంత వేధిస్తున్నాయి?

ఉక్రోషపడిపోయాను. మరో పావుగంట బాధతో, చిరాకుతో గడిచాక మళ్ళీ పనిలో పడ్డాను.

ఈ రోజు శనగపప్పు, కొబ్బరి కూర చెయ్యవే అమ్మా" అంది తులసి-

దానిదేముంది? అదేమంత కష్టమైన పని కాదని ఉత్సాహం పుంజుకుని శనగపప్పు డబ్బా తీశాను. ఉలిక్కిపడ్డాను. డబ్బా నిండా పుట్టలు పుట్టలు చీమలు.

ఛీ! ఛీ! బ్రతుకంతా ఈ చీమల్ని దులుపుకోవడంతోనే సరిపోతుందేమో అని విసుగ్గా - పప్పు ఒక స్టీలు పళ్ళెంలో పోసి ఎండలో పెట్టాను. కొబ్బరి చిప్ప కసిగా నీళ్ళ బక్కెట్టులో పడేశాను. ఈ రకంగా వంట పూర్తి చేసే సరికి ఆలస్యమయేట్టుందని కొంచెం ఉప్మా చేద్దామని రవ్వ తీశాను. హమ్మయ్య ఇదొక్కటే చీమల్లేకుండా కనిపించింది అనుకున్నాను.

బయట కాలింగ్ బెల్ మోగింది - ఉప్మా రవ్వ అక్కడే పెట్టి, వెళ్ళి తలుపు తీశాను. ఎప్పుడో పాతికేళ్ళ నాటి మిత్రులు అనుకోకుండా వచ్చారు. ఏదో పెళ్ళికని వచ్చార్ట - ఒకసారి చూసిపోదామని వచ్చారు. ఎంతో ఆనందమైంది. వాళ్ళూ, మేమూ పక్కపక్క నుండేవాళ్ళం-

కబుర్లలో పడ్డాం. వాళ్ళ పిల్లల గురించి, ఉద్యోగాల గురించి, చదువులు పెళ్లిళ్ళు- ఒకటేమిటి పాతికేళ్ళనాటి సంగతులన్నీ మా మధ్యన దొర్లాయి. కనీసం కాఫీ కూడా వద్దన్నారు. అన్నీ పెళ్ళివారింట్లో పూర్తి చేసుకునే వచ్చార్ట. వాళ్ళు వెళ్లేసరికి గంటన్నర పట్టింది.

వాళ్ళని పంపించి తలుపు వేసి వచ్చేసరికి బొంబాయి రవ్వ నిండా చీమలు హడావిడిగా తిరిగేస్తున్నాయి. ప్రాణం ఉసూరుమంది. సులభంగా వాటిని ఏరేసి, ఎండలో ఉన్న పశ్చి శనగపప్పు, పళ్ళెం వైపు చూశాను. ఒక్క చీమ కూడా లేదు. ఎండ చిర్రుమంటోంది. అందుకని అన్నీ పోయాయని ఆనందపడ్డాను. పళ్ళాన్ని తీసుకొచ్చి పప్పులో రాళ్ళేమన్నా ఉన్నాయేమో చూద్దామని వొళ్ళో పెట్టుకుని చేత్తో అటూ ఇటూ కదిలించాను.

మిలటరీ ఆర్డర్ పాటించే సిపాయిల్లా ఒకేసారి కొన్ని వందల చీమలు నా వొళ్ళంతా పాకి చెడ కుట్టేశాయి. అప్పుడు తెలిసింది - గోవర్ధన పర్వతం కింద గోపాలకుల్లా చీమలన్నీ ఎండకి పళ్ళెం కింద చేరాయని - తట్టుకోలేని బాధతో ఏడుపొచ్చేసింది. బాధతో గిజగిజలాడిపోయాను. స్నానం చేస్తే చల్లటి నీటి వల్ల కాస్త ఉపశమనంగా ఉంటుందని ఆరేసిన చీర తీసుకుని బాత్‌రూంలోకి పరుగెట్టాను. కరెంట్ కట్ వల్ల బాత్‌రూం కాస్త చీకటిగానే ఉంది. షవర్ తిప్పగానే స్వర్గమే జారి నా వంటి మంటకి మందు రాస్తున్నట్టనిపించింది - చీర చుట్టబెట్టుకుని బయటకొచ్చాను. ముళ్ళ కంపను కౌగలించుకున్నట్టు ఒళ్ళంతా భగ్గుమంది. ఆరేసిన చీరనంటుకుని కంటికి కానరాని ఎర్రచీమలు.

నెమ్మదిగా పరిశీలిస్తే బారులు తీరి చీమలు హడావిడిగా పాక్కుంటూ వెళ్ళిపోతున్నాయి. ఎదురెదురుగా కలిసినప్పుడు గ్రీట్ చేసుకుంటున్నాయి. మళ్ళీ తొలగిపోతున్నాయి. ఏదో కొంపలు మునిగిపోతున్నట్టు ఒకటే హడావిడి. అల్మారా మూలల నుంచీ, ప్రతీ తలుపు సందులోంచి, ఎక్కడపడితే అక్కడ - పాలకీ, పెరుక్కీ కూరలకీ, కారానికి, పచ్చళ్ళకి, పప్పులకి, నూనెలకి, బట్టలకీ, పరుపు మీద దర్జాగా, బిందె అంచుల మీద చల్లగా, కూజాకి చుట్టిన తడిగుడ్డ లోపల భద్రంగా - అంత బాధలోనూ ముళ్ళపూడి వెంకటరమణగారి చీమాభా అనే మాట గుర్తుకొచ్చి నవ్వొచ్చింది.

ఒళ్ళంతా సలపరంగా జ్వరమొచ్చినట్టయిపోయింది. తులసి ఒక అవిల్ మాత్ర ఇచ్చి "పడుకో" అంది.

కళ్ళు మూసుకున్నాను. పడుకుని నిద్రపోవాలనే ప్రయత్నం. యుద్ధాలు చేయడంలో నేర్పరి మనిషి. శత్రువుని పొంచి దెబ్బతీయడంలో మానవుడిది అందెవేసిన చెయ్యి. మానవుడు అంతరిక్షంలో ఎగరగలడు. జలాంతర్గామిలో ప్రయాణించగలడు. అణుశక్తితో ప్రపంచాన్ని అల్లకల్లోలం చేయగలడు – కానీ ఈ చీమల్నీ, దోమల్నీ ఏం చేయలేకపోతున్నాడు. సాదు కీటకం అనుకునే చీమ ప్రాణాలు తోడేస్తోంది.

పక్కకి వొత్తిగిలి పడుకున్నాను.

చీమలో బ్రహ్మలో
శివకేశవాదులలో
ప్రేమ మీర వెలుగుచుండె....
.... ... .... ..

రామా నన్ను బ్రోవరా త్యాగరాజస్వామి వారి కృతి లోని చీమ ఇదేనా?

❖ ❖ ❖

బాంబు దాడికి కళ తప్పిన మహానగరంలా తెల్లారినా నేను మంచం మీదే ఉండిపోయాను. రాజ్యం వస్తూనే పెద్ద గొంతుతో పిలుస్తూ లోపలకొచ్చి

"ఏమిటే మంచం మహారాణీ, ఏమైందీ – ఇంకా మంచం మీదే ఉన్నావు" అంది.

నేనేం చెప్తాను. "కాస్త నీరసంగా ఉంటే పడుకున్నా" అంటూ లేవబోయాను.

"అవున్లే, జరుగుబాటుంటే నాకూ నీరసంగానే ఉంటుంది" అంది. అది వేళాకోళమో, అక్కసో తెలీదు. ఏద్వలేక నవ్వాను.

"ఇంట్లో అన్ని సదుపాయాలూ ఉన్నాయి. చెట్టంత కూతురన్నీ చేస్తుంది" అంది.

"భలే దానివే. దానికేం పనిలేదనుకున్నావా?" అన్నాను చిరాగ్గా.

"అది సరేగానీ, దానికి పెళ్ళి చెయ్యవా?" అంటూ ప్లేటు మార్చింది.

"చెయ్యాలంటే కలిసి రావాలిగా" అన్నాను.

"కలిసిరావాలంటే మన ప్రయత్నం కూడా ఉండాలిగా" అంది వెక్కిరింతగా.

"దాని రీసెర్చ్, పూర్తయితేనేగానీ, చేసుకోనని కూర్చుంది" అన్నాను ధైర్యంగా.

"అంతా దానిష్టమేనా, నీకా వయసుకి ఇద్దరు పిల్లలు పుట్టారు" అంది.

నాకు వొళ్ళు మండిపోయింది. చనువు పేరుతో, చుట్టరికం పేరుతో కొందరిలా మాట్లాడ్డానికి వస్తూంటారు.

ఆమె నాకంటే పెద్దదేమీ కాదు సరి కదా చిన్నది. దానికి వయసు కంటే ముందే అన్నీ అయిపోయాయి. జీవితం మోడులా వెళ్ళదీస్తోంది. నోటికి అద్దూ, అదుపూ లేదు.

'అయినా నాకెందుకవన్నీ, నీ కూతురు, నీ యిష్టం. చేసుకుంటే చేసుకుంటావు లేకుంటే ఇంట్లోనే ఉంచుకుంటావు, అసలు నేనొక మాట అడిగిపోదామని వచ్చాను.

నేనేం మాట్లాడలేదు.

"మొన్న నువ్వు కొత్తగుళ్ళ దగ్గరికి వచ్చావట? అక్కడికి నాలుగు వీధులేగా రాలేదే?" నిలేసింది.

"కుదరలేదు. ఈసారి వస్తాలే"

"నేనస్తమానూ వస్తాను. మీరటు వచ్చినా రారు. నేనంటే లోకువ. మీకే ఉంటాయి పెద్ద పనులు. మాకేం ఉండవు. అవున్లే. మీరంటే గొప్పవారు. మాకేముంది? మీలాగా డబ్బా, ఇల్లా, పరపతా, పలుకుబడా" రెచ్చిపోయింది రాజ్యం. నేను సహించలేకపోయాను.

"రాజ్యం! ఏమిటా వాగుడు? నీకెంత తోస్తే అంత మాట్లాడటమేనా? ఈసారి వస్తానన్నానుగా"

"వస్తే రా, లేకపోతే లేదు. ఒక్కటి మాత్రం గుర్తుంచుకో. నువ్వు మా యింటికొచ్చాకే నేను మళ్ళీ మీ ఇంటికొచ్చేది - మీ గడప తొక్కేది"

ఇదే విధంగా మరో అరగంట సాధించి, వేధించి రాజ్యం వెళ్ళిపోయింది.

నిన్న అన్ని వందల చీమలు నన్ను అంతగా కుట్టినా ఇంత బాధగా అనిపించలేదు.

(ఆదివారం, ఆంధ్రజ్యోతి డైలీ, జులై 14, 1996)

(తెలుగు విశ్వవిద్యాలయం వారి సంకలనంలో (1996)లో చేర్చబడింది)